


మన భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం




బుధవారం 12 ఆగష్టు 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 3

# ఆరుతడి పంటలను సాగు చేయాలి

**-పొలాల్లోకి దిగిన సూర్యాపేట కలెక్టర్**

**-రైతులతో మాట - పంట మార్పిడికి బాటలో రైతులకు దిశానిర్దేశం**

భానుపురి /ఆత్మకూర్ (ఎస్)

వాతావరణం మారుతోంది.. నీళ్లు తగ్గుతున్నాయి, అందుకే తక్కువ నీటితో ఎక్కువ లాభం వచ్చే ఆరుతడి పంటల వైపు మళ్లండని సూర్యాపేట జిల్లా కలెక్టర్ రైతులకు సూచించారు. మంగళవారం జిల్లాలో నిర్వహిస్తున్న రైతులతో మాట - పంట మార్పిడికి బాట కార్యక్రమంలో భాగంగా ఆయన ఆత్మకూరు, మద్దిరాల, నూతనకల్లు మండలాల్లో పర్యటించారు. స్వయంగా వ్యవసాయ క్షేత్రాల్లోకి వెళ్లి రైతులతో ముచ్చటించారు.

**జర్బరా సాగు బాగుంది**

ఆత్మకూరు మండలంలోని వీరారెడ్డి, సందీప్ రెడ్డి పొలాల్లో సాగవుతున్న పెసర, బంతి తోటలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం తుమ్మలపల్లి గ్రామంలో రైతు సౌనయ్య సాగు చేస్తున్న 'జర్బరా' పూల పాలీహౌస్‌ను చూసి అభినందించారు. వరికి బదులు ఇలాంటి కొత్త రకం పంటలు వేయడం వల్ల ఆర్థికంగా మంచి లాభాలు ఉంటాయని చెప్పారు. కంది, బొబ్బర్లు, వేరుశనగ, మొక్కజొన్న, జొన్నలు, సజ్జలు, కూరగాయలు పండిస్తే తక్కువ కాలంలోనే చేతికి డబ్బులొస్తాయని వివరించారు.

**అంతర పంటలతో అదనపు ఆదాయం**

మద్దిరాల మండలం పోలుమల్లలో రైతు ఎల్లు వెంకటరెడ్డి ఆయిల్ పామ్ తోటలో అంతర పంటగా పెసర వేయడాన్ని కలెక్టర్ పరిశీలించారు. మిగిలిన భూముల్లో మిర్చి సాగు చేసుకోవాలని సూచించారు. నూతనకల్లు మండలంలో కొండ్ర వెంకటరెడ్డి, వినోద పొలాల్లో పత్తి, కంది అంతర పంటలను చూసి సలహాలిచ్చారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున, రైతులు వరి సాగును తగ్గించుకోవాలని కోరారు.



**ఆయిల్ పామ్ పెంపకమే లక్ష్యం**

జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ఒక ఉద్యమంలా చేపట్టాలని ఉద్యానవన శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా ఆయిల్ పామ్ వేసే రైతులకు పూర్తి సమాచారం అందించాలి. మండలంలో సక్సెస్ అయిన రైతుల విజయగాథలను ఇతరులకు వివరించాలని సూచించారు. పది రోజుల పాటు నిర్వహించే రైతులతో మాట ప్రోగ్రామ్‌ను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. ఖాళీగా ఉన్న భూములను గుర్తించి, ఆ రైతులను పంట మార్పిడి వైపు మళ్లించాలని ఆదేశించారు. మండలాల్లో విత్తనాలను ఎప్పుడూ అందుబాటులో ఉంచాలని, క్షేత్రస్థాయిలో వ్యవసాయ, ఉద్యానవన, విస్తరణ అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమం లో జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, ఆత్మకూరు (యస్) నూతనకల్ మద్దిరాల మండల ప్రత్యేక అధికారులు డి.విశాల్, భారతి, తహసిల్దార్లు అమిన్ సింగ్, శ్రీనివాస్, తబిత, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో సభ్యులకు గుర్తింపు కార్డుల పంపిణీ

భానుపురి /సూర్యాపేట టౌన్




శ్రీ వాసవి సేవా సమితిలో సమాజ సేవ చేయాలనే లక్ష్యంతో చేరిన సభ్యులకు శ్రీ వాసవి సేవా సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం మంగళవారం సంఘ కార్యాలయంలో గుర్తింపు కార్డు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ వాసవి సేవా సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు పూరి సురేష్ శెట్టి సభ్యులుగా ఉన్న ప్రతి ఒక్కరికి హైదరాబాదులోని రెండు కార్పొరేటర్ ఆస్పత్రులు, కర్నూలు వనపర్తి లో సైతం ఫీజు రాయితీ కల్పించారని తెలిపారు. శ్రీ వాసవి సేవా సమితి ద్వారా ఎన్నో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున, ఆసక్తి గలవారు సభ్యులుగా చేరవచ్చు అన్నారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి సేవాసమితి సహాయ కార్యదర్శి బజ్జూరి శ్రీనివాస్ కు గుర్తింపు కార్డు అందజేయడం జరిగింది.

## పబ్లిక్ క్లబ్ ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో జరపాలి



భానుపురి /సూర్యాపేట టౌన్

పబ్లిక్ ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించాలని కోరుతూ మంగళవారం స్థానిక ఆర్డిఓకు కొంతమంది సభ్యులు వినతి పత్రం అందజేసిన అనంతరం మీడియాతో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, మాజీ కౌన్సిలర్లు, గండూరి కృపాకర్, తాహెర్ పాషా, ప్రముఖ న్యాయవాదులు నాతి సవేందర్ గోండ్రాల అశోక్, నల్లకుంట్ల అయోధ్య లు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పబ్లిక్ క్లబ్ ఎన్నికలు నిర్వహించాలి,సభ్యుల్లో ఉద్యోగులు ఉన్నందున సెలవురోజున ఎన్నికలు నిర్వహించాలని తెలిపారు. మరణించిన సభ్యులను జాబితా నుంచి తొలగించాలనీ, ఉన్న సభ్యులందరితో కూడిన జాబితాను విడుదల చేయాలన్నారు.ప్రతీ సభ్యుడికి ఫోటోతో కూడిన ఓటర్ కార్డు తో పాటు నామినేషన్, విత్ డ్రాలకు గడువు కేటాయించాలన్నారు.ఎన్నికలకు బ్యాలెట్ బాక్స్ లు ఏర్పాటు చేసి సీక్రెట్ ఓటింగ్ నిర్వహించాలన్నారు. ఓటింగ్ రోజునే ఫలితాలు విడుదల చేయాలనీ, రాజకీయాలకతీతంగా ప్రజాస్వామ్య బద్దంగా క్లబ్ ఎన్నిక నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# వ్యాపారులు కలిసికట్టుగా ఉండి పని చేసుకోవాలి





భానుపురి/సూర్యాపేట టౌన్

వ్యాపారులు కలిసికట్టుగా ఉండి పని చేసుకోవాలని ఏఐసీసీ నాయకులు రామ్ రెడ్డి సర్వోత్తమ రెడ్డి తెలిపారు. ఇటీవల సూర్యాపేట కిరాణం అండ్ ఫాన్సీ మర్చంట్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వైట్ హౌస్ లో ఏఐసీసీ నాయకులు రామ్ రెడ్డి సర్వోత్తమ రెడ్డిని మర్యాదపూర్వకంగా నూతన కమిటీ కలవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీకి ఏఐసీసీ నాయకులు రామ్ రెడ్డి సర్వోత్తమ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపారుల సంక్షేమం కోసం సమిష్టిగా కృషి చేయాలని, అసోసియేషన్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ , జిల్లా కాంగ్రెస్ నాయకులు మోరిశెట్టి లక్ష్మాది, కక్కిరేణి చంద్రశేఖర్ కిరాణం అండ్ ఫాన్సీ అసోసియేషన్ అధ్యక్షులు వెంపటి రమేష్ కార్యదర్శి పాలవరపు నరసింహారావు కోశాధికారి చల్లా విశ్వనాథం సభ్యులు పోతుగంటి వెంకటేశ్వర్లు, చల్లా లక్ష్మయ్య, బెలిదే రాజేష్, సోమ



ప్రవీణ్ కుమార్, గుండా వెంకన్న,చింత వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ కంటి ఆసుపత్రి ద్వారా పేద ప్రజలకు మరిన్ని సేవలు అందించాలి







భానుపురి/సూర్యాపేట టౌన్

లయన్స్ కంటి ఆసుపత్రి ద్వారా పేద ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఏఐసీసీ నాయకులు రామ్ రెడ్డి సర్వోత్తమ రెడ్డి తెలిపారు.ఈ నెల 10 సోమవారం సూర్యాపేట లోని లయన్స్ కంటి ఆసుపత్రి లో లయన్స్ కంటి ఆసుపత్రి నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వైట్ హౌస్ లో ఏఐసీసీ నాయకులు రామ్ రెడ్డి సర్వోత్తమ రెడ్డిని మర్యాదపూర్వకంగా నూతన కమిటీ కలవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీకి ఏఐసీసీ నాయకులు రామ్ రెడ్డి సర్వోత్తమ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. లయన్స్ కంటి ఆసుపత్రి నూతన పాలక వర్గం పేద ప్రజలకు మరిన్ని సేవలు నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ , జిల్లా కాంగ్రెస్ నాయకులు మోరిశెట్టి లక్ష్మాది, కక్కిరేణి చంద్రశేఖర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు మీలా మహదేవ్ కోశాధికారి చిలుముల శ్రీనివాసరెడ్డి తో పాటు నూతన కమిటీ తోట శ్యాంప్రసాద్,రాచర్ల కమలాకర్,రాచకొండ శ్రీనివాస్ మిరియాల సుధాకర్, పోలే బోయిన నరసయ్య యాదవ్, గుణగంటి రాములు, బోనగిరి భాస్కర్, నూక వెంకటేశం గుప్తా, భెలిదే అంజయ్య, ఆరే సురేష్ రెడ్డి,కుమ్మరీకుంట్ల లింగయ్య,మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై కృషి






భానుపురి /సూర్యాపేట ఎస్పీ కార్యాలయం

సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ నరసింహ మంగళవారం సూర్యాపేట డివిజన్ స్థాయి పోలీసు అధికారుల నెలవారి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గత నెలలో నమోదైన కేసుల తీరుతెన్నులు, పోలీసు దర్యాప్తు మరియు కేసుల పురోగతి స్థితిగతులను సమీక్షించారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి పని చేయాలని స్పష్టం చేశారు. సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రణాళికతో పని చేస్తూ కృషి చేయాలని అన్నారు. మహిళల భద్రతలో ప్రాధాన్యం తో పని చేసి బాధితులకు త్వరగా సేవలు అందించాలని కోరారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, కేసులు ఏమాత్రం పెండింగ్‌లో ఉండొద్దు అని అధికారులను ఆదేశించారు. నేరాల అదుపునకు సాంకేతిక పద్ధతులను ఉపయోగించాలని, క్షేత్రస్థాయిలో సమాచారం ఇచ్చే వనరులను మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సమాజంలో నేరాల నియంత్రణకు ప్రజల్లో విస్తృత చైతన్యం కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. డీఎస్పీలు, సీఐలు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పనితీరుపై, సిబ్బంది విధి నిర్వహణపై నిరంతర క్షేత్ర స్థాయి పర్యవేక్షణ ఉంచాలని, సిబ్బందిని ఎప్పటికప్పుడు మోటివేషన్ చేస్తూ ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, డిసిఆర్బీ డీఎస్పీ రవి, డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ లు వెంకటయ్య, నాగేశ్వరరావు, ఉపేందర్ రావు, రాజశేఖర్, డివిజన్ ఎస్సైలు, టెక్నికల్ టీం ఎస్ఐ రాజశేఖర్ డిసిఆర్బీ ఎస్ఐ ఝాన్సి రాణీ, మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా సీతారామచంద్రస్వామి వారి మాస కళ్యాణం



భానుపురి /సూర్యాపేట కల్చరల్

జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్ లో గల శ్రీవేదాంత భజన మందిరంలోని సీతారామ చంద్రస్వామి వారి పునర్వసు జన్మ నక్షత్ర సందర్భంగా మంగళవారం స్వామివారి మాస కళ్యాణంను దేవాలయ అర్చకులు దరూరి సింగరాచార్యుల ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా శ్రీసీతారామ లక్ష్మణ ఆంజ నేయ స్వామి ఉత్సవ విగ్రహములకు పంచా మృత అభిషేకం నిర్వహించారు. పట్టు వస్త్రాలు అలంకరింపజేసి, వివిధ రకాల పూలతో అలంకారం చేసి వివిధ రకాల పండ్లతో నైవేద్యం సమర్పించారు. శాస్త్రోక్తంగా కళ్యాణతంతును నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్య క్రమంలో శ్రీవేదాంత భజన మందిరం అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి నకర కంటి రాజశేఖర్ కోశాధికారి సోమ అశోక్, ఈగ వెంక టేశ్వర్లు, షీలా శంకర్, సోమ సుమన్, వాసా కృష్ణ, చింత వెంకన్న, అర్చకులు ధరూరి రాఘవా చార్యులు, మందిర మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# కష్టపడి చదివి.. కలలను నిజం చేసుకోండి

భానుపురి ఆత్మకూర్ (ఎస్)

విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్‌పవార్ అన్నారు. మంగళవారం ఆయన ఆత్మకూరు(ఎస్) కేజీబీవీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, వంటగది, వసతి గదులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కాసేపు ముచ్చటించి, వారి విద్యాభ్యాసం గురించి అడిగి తెలుసుకున్నారు. మెనూ గురించి ఆరా తీశారు. భోజనం నాణ్యతగా ఉందని, ఇదే నాణ్యతను నిరంతరం కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. చదువుతో పాటు పౌష్టికాహారం కూడా విద్యార్థులకు ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. తరగతి గదిలోకి వెళ్లిన కలెక్టర్.. విద్యార్థులతో సరదాగా మాట్లాడారు. "పెద్దయ్యాక మీరు ఏమవుతారు?" అని ప్రశ్నించగా.. పలువురు విద్యార్థులు డాక్టర్, ఇంజనీర్, కలెక్టర్



అవుతామని ఉత్సాహంగా సమాధాన మిచ్చారు. విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని చూసి ఆయన అభినందించారు. సొంత కాళ్లపై నిలబడాలంటే చదువే ఏకైక మార్గం. కష్టపడి చదివి మీ తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని హితబోధ చేశారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

**అధికారులకు ఆదేశాలు..**

పాఠశాల ఆవరణను పరిశీలించిన కలెక్టర్.. పరిశుభ్రత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం



చేశారు. తాగునీటి వసతి, టాయిలెట్ల నిర్వహణ నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే కాకుండా, వారి ఆరోగ్యం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి విశాల్, తహసిల్దార్ అమిన్ సింగ్ ప్రిన్సిపాల్ వై సరస్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేటలో మున్సిపల్ షాపుల బహిరంగ వేలం

భానుపురి /సూర్యాపేట టౌన్




సూర్యాపేట మున్సిపల్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ఖాళీగా ఉన్న మున్సిపల్ షాపులను బహిరంగ వేలం ద్వారా అద్దెకి ఇవ్వనున్నట్లు సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హనుమంత్ రెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్నవారు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు పొంది ఈ నెల 18న సాయంత్రం ఐదు గంటల లోపు సమర్పించాలని కోరారు. అలాగే 19వ తేదీ ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ వేలంపాట కార్యక్రమంలో దరఖాస్తుదారులందరూ పాల్గొనాలన్నారు.

# ఆపదలో అండగా బాల్య మిత్రులు.. జర్నలిస్టుకు ఆర్థిక సాయం



భానుపురి /సూర్యాపేట టౌన్

ఆపదలో ఉన్న బాల్య మిత్రుడికి అండగా నిలిచి స్నేహబంధాన్ని చాటుకున్నారు. జిల్లా ప్రభుత్వ బాలుర పాఠశాల 2003--04 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న సూర్యాపేట మండలం కేసారం గ్రామానికి చెందిన జర్నలిస్ట్ చింత సతీష్‌ను మంగళవారం ఆయన నివాసంలో కలిసి రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. సూర్యాపేట పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ మొదటి బ్లాక్‌లోని సతీష్ స్వగృహానికి చేరుకున్న బాల్య మిత్రులు ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును, ప్రస్తుతం తీసుకుంటున్న చికిత్స, విశ్రాంతి వివరాలను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ.. తమలో ఒకరిగా ఉంటూ ఎంతో ఆప్యాయంగా మెలిగే సతీష్ రోడ్డు ప్రమాదానికి గురికావడం బాధాకరమన్నారు. ప్రస్తుతం తమ మిత్రుడు కోలుకుంటూ తమ కళ్లముందు కనిపించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆపదలో ఉన్న స్నేహితుడికి తమ వంతు సహాయం చేయడం బాధ్యతగా భావించామని తెలిపారు. సతీష్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వినయ్, లక్ష్మీ నర్సు, ప్రవీణ్, రంగయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు

# సూర్యాపేట ప్రాంతానికి రైల్వేలైన్ అనేది తప్పనిసరి

భానుపురి/సూర్యాపేట టౌన్

సూర్యాపేట ప్రాంతానికి రైల్వే లైన్ అనేది తప్పనిసరి ఎందుకంటే హైదరాబాదు విజయవాడ అమరావతికి మధ్యలో ఉన్నటువంటి సూర్యాపేట వ్యాపార పరంగా విద్యాపరంగా పారిశ్రామికపరంగా జనాభాపరంగా ఎంతో అభివృద్ధి చెంది ఉన్నది వాస్తవంగా హైదరాబాద్ సూర్యాపేట కోదాడ జగ్గయ్యపేట మీదుగా అమరావతి కి వెళ్లాల్సినటువంటి రైల్వే ట్రాక్ ను ఎందుకు మార్చవలసి వచ్చింది దీనికి అధికార రాష్ట్ర పాలకులు కేంద్ర రైల్వే బోర్డు బిజెపి మంత్రులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉన్నది. హైదరాబాదు నుండి సూర్యాపేట మీదుగా రైల్వే లైన్ వెళ్లినట్లయితే ఆ రహదారి వెంబటి జనాభా అధిక జనాభా గలిగిన పట్టణాలు ఉన్నాయి. చౌటుప్పల్ చిట్యాల నార్కట్పల్లి సూర్యాపేట కోదాడ హుజూర్నగర్ పట్టణాలు అధిక జనాభా కలిగిన ప్రాంతాలు అలాగే భారతదేశం లోనే ఎన్ హెచ్ 65 అనే రహదారి అత్యంత రద్దీగా ఉన్నటువంటి రహదారి అలాంటి రహదారి వెంట రైల్వే లైన్ గనక ఉన్నట్లయితే ట్రాఫిక్ ఇబ్బందులు రోడ్డు యాక్సిడెంట్లు తగ్గేటటువంటి అవకాశం ఉన్నది. అలాగే బుల్లెట్ రైలు గాని మరి ఈ ప్రాంతానికి ఉన్నట్లయితే ఈ ప్రాంత ప్రజలు హైదరాబాద్ పట్టణానికి వలస వెళ్లాల్సినటువంటి అవసరం కూడా ఉండదు మరి అలాగే ఈ ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందినటువంటి అవకాశం ఎక్కువ ఉన్నది. ఎక్కువ జనాభా ఉన్నటువంటి ప్రాంతాల గుండా వెళ్లాల్సినటువంటి రైలు అనేక మంది ఎక్కువ మంది ప్రజలకు ఉపయోగపడాల్సినటువంటి రైల్వే వ్యవస్థను కొంత మంది రాజకీయ నాయకులు లేక తెలంగాణ ఆంధ్ర నాయకుల ప్రాబల్యంతో ఈ రైల్వే లైను మార్చినట్టు అనుమానాలు ఉన్నాయి. తక్కువ ప్రాంతాలు తక్కువ జనాభా ఉన్న ప్రాంతాల గుండా రైల్వే లైను వెళ్లడం వల్ల ఉపయోగం ఏమిటి అనేది ఒక ప్రశ్న. సూర్యాపేట నుండి రైల్వే లైన్ ప్రతిపాదించినప్పటికీ ఆ ప్రతిపాదనను రద్దుచేసి మరొక చోటికి మార్చాల్సిన అవసరం ఏమొచ్చింది అనేది మేము అడుగుతున్నటువంటి ప్రశ్న మరి ఈ ప్రాంతం నుండి రైల్వే లైన్ పక్క ప్రాంతానికి వెళుతున్నటువంటి సందర్భంలో ఈ ప్రాంతంలో చెందినటువంటి చౌటుప్పల్ చిట్యాల నార్కట్పల్లి,నకిరేకల్ సూర్యాపేట కోదాడ హుజూర్నగర్ ఈ ప్రాంతానికి చెందినటువంటి ప్రజాప్రతినిధులు




కానీ రాజకీయ నాయకులు గానీ ఎందుకు నోరు మెదపడం లేదు. సూర్యాపేట ప్రాంతపు ప్రజలు రైల్వే సాధన సమితిగా ఏర్పడి ఉద్యమిస్తున్నటువంటి ఈ సందర్భంలో వారికి అండగా ఉండాల్సినటువంటి ఈ ప్రజాప్రతినిధులు ఎందుకు ఉండ లేకుండా పోతున్నారు ఎందుకు మాతో గొంతులు కలపలేక పోతున్నారు అనేది ఆందోళన చెందుతున్నటువంటి విషయం రాజకీయ నాయకులారా ప్రజాప్రతిల్లారా ఎంపీలు గాని మంత్రులు గాని ఎమ్మెల్యేలు గాని మున్సిపల్ చైర్మన్ గాని మున్సిపల్ మెంబర్ వార్డ్ మెంబర్లు గానీ గ్రామపంచాయతీ సర్పంచులు గాని గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్లు గాని మరి మీకు ప్రజల దగ్గరికి వెళ్లి ఓట్లు అడుగుతారు గాని ప్రజల సౌకర్యార్థం కోసం ప్రజలు ఈ ప్రాంతానికి రైల్వేలైన్ అవసరమని కోరుకుంటున్న అటువంటి ఈ సందర్భంలో ప్రజల మనోభావాలకు అనుగుణంగా ప్రజల ఇష్టానికి అనుగుణంగా మీరు ఉద్యమించాల్సిన అవసరంఉన్నది. రైల్వే లైన్ కోసం మీరు ఎందుకు నోరు పడవలేదు ఎందుకు ఉద్యమానికి మద్దతు ఇవ్వడం లేదు ఎందుకు మీరు రోడ్లమీదకి రావడం లేదు అని ప్రజాప్రతినిదులను మేము ప్రశ్నిస్తున్నాం. ఏదో ఒక నాయకుడు గాని పార్టీ గాని ఫ్లెక్సీలు చెప్పారని అనుచిత వ్యాఖ్యలు చేశారని దిష్టిబొమ్మలు తగలబెడుతూ రోడ్ల మీదకు వచ్చేటటువంటి మీరు సూర్యాపేటకు రావాల్సిన రైల్వే లైన్ పక్క ప్రాంతానికి వెళుతుంటే మీ పార్టీ గాని మీ పార్టీ కార్యకర్తలు గాని ఈ పార్టీ నాయకులు గానీ ఎందుకు మాతో కలిసి రైల్వే లైన్ కోసం పోరాటం చేయాల్సినటువంటి బాధ్యత మీకు ఉందా లేదా అనేది మీరే ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది. అవసరమైతే రైల్వే లైన్ గనక ఈ ప్రాంతానికి రాకుండా పోయినట్లయితే మీ పదవులకు కూడా రాజీనామా చేయాల్సినటువంటి అవసరం కూడా ఉండవచ్చు. అలాంటి సందర్భంలో మీరు రాజీనామా చేసి మీ పార్టీలకు ఈ పార్టీ పదవులకు రాజీనామా చేసి ఈ ఉద్యమంలో పాలుపంచుకోవాల్సిన అవసరం ప్రజాప్రతుల గా మీ మీద ఉంది. అలాగే సూర్యపేట ప్రాంత ప్రజలు మరియు రైల్వే లైను ప్రతిపాదించినటువంటి పట్టణాలు ప్రజలు అందరు కూడా ఏకమై ముక్కుమ్మడిగా రైల్వే లైన్ కోసం పోరాడాల్సినటువంటి అవసరం ఎంతైనా ఉంది అన్ని ప్రజా సంఘాలు గాని కుల సంఘాలు గాని వృత్తి సంఘాలు గాని రాజకీయ సంఘాలు గాని అన్ని సంఘాలు ఏకమై ఈ ప్రాంత ప్రజలందరూ రైల్వే లైను సాధించడానికి ఉద్యమాన్ని వ్యక్తుల ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది .ఉద్యమిస్తే తప్ప మనకు రైల్వే లైను రాదు అన్న విషయం మనం గుర్తుంచుకోవాలి. అందుకోసమై ప్రతి ఒక్కరం పిడికిలి బిగించి రైల్వే లైన్ కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా గుర్తించి తప్పకుండా రైల్వే లైన్ కోసం పోరాడతారని ఆశిస్తున్నాం

.రైల్వే సాధన సమితి సూర్యాపేట
కుసుమ సిద్ధారెడ్డి
తెలంగాణ అమరవీరుల వేదిక
99 89 189114